పోటీకి దిగితే పతకమే..

- కరాటేలో పతకాల హోరు
- సత్తా చాటుతున్న విద్యార్థులు
- పలు విభాగాల్లో ప్రతిభ


కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

ప్రకాశం నగర్: నేటి విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణిస్తున్నారు. ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా ఇంకొందరు నేర్చుకుంటున్నారు. వీరిలో కొందరు క్రీడాకారులు సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెలకువలు నేర్చుకుంటూ, ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేలో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించి పతకాలు సాధిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణలు వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు ఆపద సమయంలో ఆదుకుంటాయి. ఇతర క్రీడలతో పోల్చితే కరాటేకు కఠోర శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం. ఈ విద్యలో రాణించడం అంత సులభం కాదని శిక్షకులు చెబుతున్నారు. ముఖ్యంగా బాలురతో పోలిస్తే బాలికలు కరాటే మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలు

చిలకలూరిపేటలోని వెంకటేశ్వర ఆర్య వైశ్య కల్యాణ మంటపంలో ఇటీవల జరిగిన జవహర్ లాల్ నెహ్రూ మోమోరియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ – 2025 పోటీల్లో నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. అండర్ 10, 12, 14, 17 విభాగాల్లో సూర్య ఆశిష్ ప్రథమ, బి.మోక్షిత్, ఎం.అశ్విన్ కుమార్ ద్వితీయ, కె.చరణ్ కృతి, ఎం.అభి, టి.శ్రీగణేష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే మహ్మద్ నూర్, సీహెచ్ లలిత, పి.గుణవీర శంకర్, సంజయ్, లక్ష్మీ సతీష్, ఇమ్మానుయేలు రన్నర్లుగ నిలిచారు. అండర్–17 కుమిటే విభాగంలో పి.పూజ ప్రథమ స్థానం సాధించింది.

కలెక్టర్ అభినందనలు

కరాటే జాతీయ పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ పి.అరుణ్ కుమార్‌తో పాటు కోచ్ పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఆసక్తి



గతంతో పోల్చితే ప్రస్తుతం క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెరిగింది. బాలురతో పాటు బాలికలు కూడా ప్రతిభ కనబరిచి పతకాలు సాధిస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే మంచి విజయాలు సాధించే అవకాశం ఉంటుంది.

– ఎస్ఆర్‌కేవీ స్వామి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి


స్కౌట్స్ విద్యార్థులతో జిల్లా సర్వశిక్షా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సుభాషిణి

స్కౌట్స్ శిక్షణ శిబిరం పరిశీలన

కడియం: బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఉపయోగపడుతుందని జిల్లా సర్వశిక్షా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సిరిపురపు సుభాషిణి అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్ శిక్షణ శిబిరాన్ని రెండో రోజు మంగళవారం ఆమె పరిశీలించారు. ఏఎంఓ గౌరీ శంకర్, సీఎంఓ శ్రీనివాస్ శిబిరంలో ఉన్న విద్యార్థులకు కల్పించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్యాంపు డైరెక్టర్ టి.సత్యనారాయణ, జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్ కుమార్, ఏఎల్‌టీలు నారాయణమూర్తి, ధనలక్ష్మి, స్కౌట్స్ టీచర్లు కల్పన, గిరిజ, జ్యోతి పాల్గొన్నారు.

ఆటోవాలా యాప్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ఆటోవాలా యాప్ ఉపయోగపడుతుందని ఆన్‌లైన్ ఆటో యూనియన్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు అన్నారు. అంబల్లా సూర్యారావు భవన్‌లో మంగళవారం ఆటో యూనియన్ సమావేశాన్ని అధ్యక్షుడు రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు.. ఆటోవాలా యాప్‌ను ఆవిష్కరించారు. ఇబ్బంది కలిగినప్పుడు ఆటోడ్రైవర్ తన మొబైల్‌లోని ఈ యాప్‌ను ప్రెస్ చేస్తే ఏఐటీయూసీ, ఆటో యూనియన్ నాయకులు అక్కడకు చేరుకుంటారన్నారు. ఆటో అండ్ మోటార్ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఈ శాసనసభ సమావేశాల్లో అమలు చేయాలని కోరారు. డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు


ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరిని సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ విజేతలుగా నిలుస్తున్నారని టాటా లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ రమణ అన్నారు. శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బత్తుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ మహిళల సాధికారత, అభ్యున్నతి, వారు అందిస్తున్న సేవలను వివరించారు. ఉపాధ్యాయులు డి.రాముడు మాట్లాడుతూ నేటి మహిళలే రేపటి నవ సమాజ నిర్మాతలన్నారు.

డ్రైనేజీలో పూడిక తీసేది ఎప్పుడో!


వ్యర్థాలతో అధ్వానంగా మారిన కాలువ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రతి ఏడాది విధిగా ఇంటి పన్నులు చెల్లిస్తున్నా పంచాయతీ నుంచి సౌకర్యాలు మాత్రం అందడం లేదు. అక్కడి కాలువలోని పూడికలను సైతం తీయడం లేదు. ఇళ్ల మధ్య ఉన్న కాలువలో పూడిక పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. ఆ కాలువలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి వల్ల ఎటువంటి వ్యాధులు ముంచుకొస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు పంచాయతీ అధికారులు, కూటమి నాయకుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయసేవలను వినియోగించుకోవాలి


సెంట్రల్ జైలును పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి మంగళవారం కేంద్ర కారాగారం, మహిళా జైలును సందర్శించారు. సెంట్రల్ జైలులోని ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలతోను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి తరఫున వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. వీటి కోసం డీఎల్ఎస్ఏ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక, జిల్లా రెండవ నిర్మాణ సభ మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగాయి. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ విజయ ప్రకాష్‌బాబు, గిడ్ల చిరంజీవితో పాటు నాలుగు డిపోల నుంచి 11 మంది సభ్యులను జిల్లా కమిటీకి ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి యూనియన్ బైలా ప్రకారం కమిటీ నిర్మాణాలు జరుగుతాయన్నారు.

వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం

కడియం: మురమండలోని సర్వకామదాంబ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర్ల రవిబాబు, కార్యనిర్వహణాధికారి నామా సత్య పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు బాదంపూడి బుచ్చి వెంకట సోమేశ్వర గురుకుశ్ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంతో మొదలైన సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ జరిగే పుష్పయాగంతో ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నామా సత్య పెద్దిరాజు తెలిపారు. కాగా.. మంగళవారం భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేదునూరి సాహిత్య సేవలు చిరస్మరణీయం


నేదునూరి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అపూర్వమైన జానపద సాహిత్యాన్ని ప్రజలకు అందించిన మహనీయుడు నేదునూరి గంగాధరం అని వక్తలు కొనియాడారు. జానపద సాహిత్యోద్యమకారుడు నేదునూరి గంగాధరం 55వ వర్ధంతిని మంగళవారం ఉదయం నేదునూరి గ్రంథాలయంలో ఏబీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ నేదునూరి రచించిన మిన్నేరు, మున్నేరు పుస్తకాల్లో అసంఖ్యాకమైన జానపద గేయాలు దర్శనమిస్తాయన్నారు. కార్యక్రమంలో నేదునూరి గంగాధరం కుమార్తె సూర్య ప్రభావతికి సత్కారం చేశారు. జానపద సాహిత్యంపై డాక్టర్ శ్రీపాద సీతామహాలక్ష్మి ప్రసంగించారు. సామాజిక వేత్త పీవీఎస్ కృష్ణారావు, ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వాధ్యక్షులు దేశిరెడ్డి బలరామ నాయుడు, కవి మల్లిమొగ్గల గోపాలరావు, డాక్టర్ దంపతులు ఎస్సీ రమేష్ ,హేమలత పాల్గొన్నారు.

రసరమ్య భరితం.. కిరణ్మయి గాత్రం



గాత్ర కచేరీ చేస్తున్న ప్రముఖ గాయని రమ్యకిరణ్మయి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి గట్టున గల త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి 74వ సంగీత వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం సమితి ఆడిటోరియంలో జరిగిన రమ్య కిరణ్మయి గాత్రం శ్రోతలను అలరించింది. పంతుల సాకేత్ వయొలిన్, ఎం.శ్రీధర్ మృదంగం, సరస్వతుల హనుమంతురావు ఘటం సహకారాలను అందజేశారు. సమితి గౌరవ అధ్యక్షుడు వాడ్రేవు వెంకట రమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జోస్యుల సరస్వతి, కార్యనిర్వాహక కార్యదర్శి వి.భాస్కర్ రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు కళాకారులను సత్కరించారు. పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు హాజరయ్యారు.

నేడు హరికథా గానం

వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రముఖ కళాకారుడు ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి హరికథా గానం చేస్తారు. పాలపర్తి సీతారామాంజనేయ శాస్త్రి వయొలిన్, బుద్ధవరపు మారుతీరామ్ మృదంగం సహకారాలను అందిస్తారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- గ్లకోమా వారోత్సవాలు ప్రారంభం



గ్లకోమా వారోత్సవాలలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరూ అవగాహనతో కంటి ఆరోగ్యం కాపాడుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు జరుగుతాయన్నారు. చూపు మసకబారడం, విపరీతమైన కంటినొప్పి, కంటి ఎరుపుదనం, తలనొప్పి, వికారం, వాంతులు, తరచుగా కంటి అద్దాల పవర్ మారడం, ప్రకాశవంతమైన లైటు చుట్టూ ఇంద్రధనుస్సు లాంటి రంగుల వలయాలు కనిపించడం, ఆకస్మికంగా కంటిచూపు కోల్పోవటం గ్లకోమా వ్యాధి లక్షణాలు అన్నారు. 40 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరిలో ఆప్టిక్ నాడికి రక్త ప్రసారణ తగ్గటం వలన ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ లావణ్య, ఎపిడిమలాజిస్ట్ సుధీర్ కుమార్, డిప్యూటీ డెమో ఎస్.సత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వద్దు

కంబాలచెరువు: పరీక్షల సమయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వరుఖ అప్పయ్యశాస్త్రి మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో పదో తరగతి గ్రాండ్ టెస్ట్‌లు, పబ్లిక్ పరీక్షల సన్నద్ధత, సరస్వతి పూజలు తదితర బిజీ పరిస్థితుల్లో ఈ నెల 12న స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాల అవసరం ఏముందని, వాటిని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వానికి తెలిపారన్నారు. స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాలను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకూ నిర్వహించాలని విద్యాశాఖ తెలిపిందన్నారు. ఈ నెల 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకాబోతున్నాయన్నారు. అదే విధంగా సరస్వతీ పూజలు నిర్వహించబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలల్లో ఒకపూట బడులు నిర్వహిస్తున్నారని, ముస్లిం ఉపాధ్యాయులు రంజాన్ మాసంలో ఉపవాస ప్రార్థనలో ఉన్నారన్నారు. ఆయా క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం దూర ప్రాంతాల్లోని స్కూళ్లలో చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియామకమై, వారి పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. కొన్ని క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలల్లో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు 12 గంటల వరకు పాఠశాలను నిర్వహించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేసి, మధ్యాహ్నం ఒంటిగంటకు ఇతర గ్రామాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లకు వెళ్లాలని హడావుడిగా నిర్దేశించడం సబబుగా లేదన్నారు. విద్యాశాఖ హడావుడి నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇటువంటి సమయాల్లో స్కూల్ కాంప్లెక్స్ (క్లస్టర్) సమావేశాలను రద్దు చేయాలన్నారు.

ఆకట్టుకున్న పిక్సెల్ ఫెస్ట్


పిక్సెల్ ఫెస్ట్‌లో విద్యార్థినిని అభినందిస్తున్న గంగిరెడ్డి

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పిక్సెల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యానిమేషన్ విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెడుతూ సృజనాత్మకతను ఉపయోగించి పలు అంశాలను ప్రదర్శించారు. దీనికి ముఖ్యఅతిథిగా సూర్య ఆకొండి హాజరయ్యారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ పి.గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్ ప్రిన్సిపల్ ఎం.చంద్రశేఖర్ సీఆర్‌టీ డైరెక్టర్ ఏ.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పేపర్ మిల్లు ఉపాధ్యక్షుడి రాజీనామా

ప్రకాశం నగర్: ఏపీ పేపర్ మిల్లు అసోసియేటెడ్ ఉపాధ్యక్షుడు (ఇండస్ట్రియల్ రిలేషన్స్) ఏ.జయకృష్ణ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. కొద్ది రోజులుగా పరంపర –2 ఉద్యోగ నియామకాల్లో అవకతవకాలు జరిగాయంటూ కార్మికులు ఆరోపణలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో జయకృష్ణ రాజీనామా చేయడంతో కార్మిక సంఘాల నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈఎస్ఐ సేవలు త్వరలో ప్రారంభించాలి


ఈఎస్ఐ ఆసుపత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

కంబాలచెరువు: రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పరిశ్రమల కార్మికులకు ఉపయోగపడేలా నిర్మించిన ఈఎస్ఐ ఆసుపత్రిలో సేవలను త్వరలో ప్రారంభించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. పేపర్ మిల్లు ఎదురుగా నూతనంగా నిర్మించిన 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల చేసే సందర్భంగా కమిషనర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రి భవనాన్ని సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ ఆమోదించిన ప్రణాళిక మేరకు పరిశీలించారు. ఏపీ బిల్డింగ్ రూల్స్‌కి అనుగుణంగా ఉందా, లేదా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, బయో మెడికల్ వేస్ట్ ప్రోసెసింగ్ కోసం షెడ్డు నిర్మించాలని సీపీడబ్ల్యూ ఇంజినీర్లకు జారీ చేశారు. ఆయన వెంట పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్, డిప్యూటీ సిటీ ప్లానర్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి పరస్పర చర్యల కోసం జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకుల సూచనలను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్‌వో, డీఈవో, సీఈవో స్థాయిలో పరిష్కరించని సమస్యల కోసం ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానిస్తోందన్నారు. రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియల అన్ని అంశాలను కవర్ చేసే చట్టబద్ధమైన ఫ్రేమ్ వర్క్ ప్రకారం కమిషన్ గుర్తించిన 28 వాటాదారులలో రాజకీయ పార్టీలు కీలకమన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడానికి వికేంద్రీకృత, బలమైన, పారదర్శక, చట్టపరమైన (ఫ్రేమ్ వర్క్) చర్యలు తీసుకుంటామన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో ప్రయోజనం

రాజానగరం: ఈ వేసవిలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని చక్రద్వారబంధంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతాంగానికి సలహాలు, సూచనలిచ్చారు. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. వేసవి సీజన్ ప్రారంభమైన ప్రస్తుత సమయంలో పొలాలను పచ్చదనంతో కప్పి ఉంచడం ఎంతో అవసరమన్నారు. ఇందుకోసం జీలుగ, జనుము, పిల్లిపెసర, విత్తనాలను చల్లాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందించడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. తద్వారా ఆయా భూములలో సాగు చేసే పంటల ద్వారా మంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డీఆర్సీ జయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. డ్రైనేజీ నిరుపయోగం

- ముందుకు వెళ్లని మురుగునీరు
- అధ్వానంగా పరిసరాలు


డ్రైనేజీలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు


డ్రైనేజీలోంచి పొంగిపొర్లుతున్న మురుగునీరు


మురుగునీటి కారణంగా మూసివేసిన నిర్మితి కేంద్రం గేటు

రాజమహేంద్రవరం రూరల్: నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీ నిరుపయోగంగా మారింది. దానిలో పారాల్సిన మురుగునీరు ముందుకు వెళ్లకుండా, పొంగిపొర్లి పక్కనే ఉన్న నిర్మితి కేంద్రంలోకి చేరుతోంది. డ్రైనేజీ కారణంగా ఆ కేంద్రానికి తాళం వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు మహిళా ప్రాంగణం పక్కనే సైన్స్ సెంటర్ నిర్మించారు. బొమ్మూరు మురళీకొండ తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు దీనిలోకి వచ్చి చేరుతోంది. దీంతో గత ప్రభుత్వంలో మురుగునీరు సైన్స్ సెంటర్‌కు వెళ్లకుండా కల్వర్టు నిర్మాణంతో పాటు, సైన్స్ సెంటర్ పక్క నుంచి తహసీల్దార్ కార్యాలయం వైటీసీ మీదుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అయితే గ్యాస్ గోడౌన్ దాటిన తరువాత రోడ్డు మధ్యలో తూరలు ఉండేవి. డ్రైనేజీ నిర్మాణ సమయంలో ఆ తూరలను తొలగించి పెద్ద తూరలు వేయకుండా ఆ తూరల పైనే శ్లాబ్ వేసేసి అక్కడ నుంచి డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు.

మురుగు కాలువలా..

చిన్న తూరలు కావడంతో మురుగునీరు ముందుకు వెళ్లక అక్కడే పొంగిపోతోంది. దీంతో పక్కనే హౌసింగ్ శాఖకు చెందిన నిర్మితి కేంద్రానికి వెళ్లే దారి మురుగు కాలువగా మారింది. మురుగునీటి వాసన భరించలేక అక్కడ పనిచేసే వాచ్‌మెన్ గేటుకు తాళం వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నెలల గడుస్తున్నా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద చిన్న తూరలు వేయడం వల్ల మురుగునీరు తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేంది. వెంటనే చిన్న తూరలను తొలగించి పెద్ద తూరలు వేశారు. అలాగే ఇక్కడ కూడా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు తూరల్లోంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్	: కింగ్‌స్టన్
స్వామి	: శబ్దం
శివజ్యోతి	: మజాకా
అనుశ్రీ	: మజాకా
రాజా	: అగత్యా
ఊర్వశి	: తండేల్
మేనక	: నారి, పౌరుషం
రంభ	: రాక్షస, రారాజా
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	: సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
అశోక	: చావా
నామవరం	
వీఎస్ మహల్	: చావా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: చావా
కడియం	
వెంకటసూర్య	: చావా